



## 22 '....టీ' వాలా కథ

"ఒకూళ్ళో రోటీవాలా, బేటీవాలా అని ఇద్దరు శత్రువులుండేవారు, ఇద్దరూ ఎప్పుడూ అడ్డమైన వాటికీ పోటీ పడేవారు. ఎదరున్న పదవి గొప్పదా కాదా అన్న ప్రశ్న కాదు. అది ఎదరవాడి క్కావాలా వద్దా అనే. వాడిక్కావాలంటే వీడికీ అదే కావాలి. ఈ వరుసనుండేది. ఓసారి మునిసిప లెల్క్షనుకి పోటీ పడ్డారిద్దరూ. ఇలాటలాటి పోటీకాదు. వచ్చేది పది రూపాయలైనా నూర్రూపాయలు తగలేసేటంతగా సాగింది ప్రచారం. పెద్దెలక్షన్ లకి జేసినంత హడావుడి చేశారు. రోటీవాలా కిటికీలంత పోస్టరే యిస్తున్నాడని తెలిసి, బేటీవాలా దోరబంధాలంత యేయించాడు. అపై యితగాడు గోడలంత రాయించాడు. దరిమిలాను సైజులు చాలక, రోటీవాలా పోస్టర్లో మొదటక్షరం మీద 'బే' అన్న దంటించి అన్నీ సొంతం జేయించాడు బేటీవాలా, రాత్రికి రాత్రి రోటీవాలా బయల్దేరీ, మళ్ళీ అన్నిటి మీదా 'రో' అన్న అక్షరం అంటించాడు. తెల్లారేసరికి ఇద్దరికిద్దరూ ఒకర్నొకరు జూసి నవ్వుకోబోయి కెవ్వుమన్నాడు. పోస్టర్ల మీద 'రో' లేదు 'బే' లేదు. తెల్ల కాగితాలంటించున్నాయి. 'టీవాలా' గోదాలో కొచ్చాడంటే వొచ్చాడన్నారు.

నామీద ఓడితే నువ్వోడాలిదప్ప, ఆడోడితే నాకేం గొప్ప అంటూ ఇద్దరి కిద్దరూ టీవాలా మీదకి దండెత్తి పాట పాడారు. చివరికి టీవాలా గోదాలోంచి తప్పుకొని బేటీవాలాతో కలిశాడు.

పోటీవాలా లిద్దరూ మళ్ళీ పుంజుకున్నారు. ఎలక్షను చాలా చోట్లలాగే ఫార్సు పద్ధతి కొచ్చింది. కాని ఆవేశాలు పెరిగాయి.

బేటీవాలా చివర్రోజున పెద్దమొత్తం అప్పుతెచ్చి నోట్లు జల్లి ఓట్లు పండించబోయాడు. ఆ జోరు ముందు రోటీవాలా ఆగలేక మాటాడ కూరుకున్నాడు. సాయంత్రం పొద్దు గుంకే వేళకి, ఇహ రోటీవాలా ఓడినట్టే పోలింగనవసర మన్నారు జనం.

అవుననవసరవేఁ నేన్నెగ్గడం ఖాయం అన్నాడు రోటీవాలా. మొండి ధైర్యం జూసి అతని మనుషులు గూడా నివ్వెరబోయారు.

"చెప్పు చూదాం సుబ్బరాజూ, ఆ పోటీలో నెగ్గి బాగుపడ్డదెవరు?" అన్నారు రెడ్డిగారు.

"చెప్పడానికి సిగ్గేస్తదిగాని, తప్పదు గాబట్టి చెబుతున్నాను. నెగ్గినోడు వేరు. బాగుపడ్డవాడు వేరూనూ. రోటీవాలా నెగ్గాడు. బేటీవాలా ఓడగా టీవాలా బాగుపడ్డాడు" అన్నాడు సుబ్బరాజు.

"అదెలాగ?" అన్నారు రెడ్డిగారు ఆశ్చర్యం అభినయించి.

"ఇప్పుడీ బేటీవాలా అనేవాడు ఓట్లు కోసం నోట్లు జల్లేస్తుంటే, రోటీవాలా కానీ విదపకుండా, కాలు కదపకుండా కూర్చున్నాడంటే ఏదో గడుసు యెత్తు వేసుండాలి కదా? అడి నోట్ల పంపకం కానిచ్చి, బాగా పొద్దుబోయాక, ఈడు పెద్ద పుకారేసుంటాడు. బేటీవాలా పంచినవన్నీ దొంగనోట్లని."

రామిరెడ్డిగారు ఉలిక్కిపడి తలెత్తి జూశాడు. సుబ్బరాజుకేసి హఠాత్తుగా అతనిమీద గౌరవం పెరిగింది. భుజం తట్టారు. 'మరి టీవాలా బాగుపడ్డాడన్నావదెలా?' అన్నారు ఆప్యాయంగా.

"అడికి పుకారు సంగద్దెలీగానే, రాత్రికి రాత్రి అద్దె సైకిలేసుకుని, ఇంటింటికీ వెళ్ళి బేటీవాలా పంచినయి దొంగనోట్లని పుకారొచ్చిందని, ఒకేళ పొరపాట్నది నిజవైతే మంచియి ఫిరాయింపిస్తాడనీ జెప్పి, పోలీసు లొస్తారనీ కంగారుబెట్టి, ఆ పగలు పంచినయన్నీ వసూలు జేసుకుని, నూటికి పది రూపాయలు నిజాయితీ కోసం బేటీవాలాకిచ్చి కడంవి జాగ్రత్తబెట్టాడు" అన్నాడు సుబ్బరాజు.

జవాబు జెప్పాడేగాని అతనికెందుకో సిగ్గేసింది. తలొంచేసుకున్నాడు. కడుపులో ఇలాంటి ఊహాలున్నట్లు అతని కెన్నడూ తెలీదు, రెడ్డిగారి మీద కూడ కోపం వచ్చింది.

## మర్యాదస్థుడి కథ

"సిగ్గెందుకు? మరేం ఫరవాలేదులే. కథ కోసం జెప్పావు. నివ్వలా టోడివని అనుకోన్లే. ఇది జరిగినా మానినా, ఎదటోడి యెత్తులు ఊహజేసి జాగర్తపడాలి గదా? నేనో చిన్న కథ జెబుతా. అందులో బ్యామ్మలాయన మనసు కనిబెట్టు చూదాం. ఆయన పెద్ద ఖామందు. ఏదో శాస్త్రిగారు (అంటూ కథ ఆరంభించారు రెడ్డిగారు) ఇంటికేవే ళెవరొచ్చినా భోజనం పెట్టి, రాత్రివేళయితే పడుకుందుకు పంచజూపి మర్యాజ్జేసేవాడు. ఇలా గుండగా ఒకనాడు రాత్రి భోజనం వేళకి ఇద్దరు పెద్ద మనుషులొచ్చారు. ఒకాయన మంత్రిగారు, మరొకాయన అపోజిషను లీడరు. ఇద్దరూ గొప్పవాళ్ళే.

ఆ ప్రాంతంలో కరువొచ్చి జనం కటకట లాడుతున్నారని దెలిసి చూడడానికి బయల్దేరారు. మరి బలగం లేదా అనేవు. అంతకు ముందెన్ని అర్జీలొచ్చినా మంత్రిగారు నమ్మలేదు. అటేపెళ్ళలేదు. ఓచోట సన్మానానికని వెళ్ళేసరికి అక్కడ సభలో ఈ అపోజిషను నాయకుడు తటస్థపడి సభలో చెరిగేశాడు. ఓ కవరు దీసి చూపించి, కరువు ప్రాంతం నుంచి తనకి అందిన అర్జీ అనీ, దానిమీద తపాలాబిళ్ళ అంటించడానికి కూడా నాలికలు తడారిపోయినందువల్లా, నీటిచుక్క పుట్టనందువల్లా స్టాంపుని గుండుసూది కేసి గుచ్చి పోస్టులో వేశారనీ అన్నాడు.

దాంతో గోలయింది. మినీస్టర్గిగా రేంజేస్తన్నాడని పేపర్లు రాశాయి. రాజధానిలో

ప్రభుత్వానికి ఎసరు మరుగుతోందని తెలిసి మంత్రిగారు నిలుచున్న పళంగా కారుజేసుకొని కరువు ప్రాంతానికి బయల్దేరాడు. ప్రతిపక్ష నాయకుడు గూడా ఆయన వెంట కదిలారు. దారిలో కారు చెడిందట. డ్రైవరును అక్కడొదిలేసి ఇద్దరూ నడక సాగించి శాస్త్రిగారి భవంతి చేరారు ఉసురుసురంటూ. ఆయన నిర్ఘాంతపోయి అహో ఇంత వారెంత ఘనంగా రావాలీ, డీలా అయిపోయొచ్చారూ అని పని విని మర్యాదల్జేశాడు.

ఇది ప్రజాస్వామ్యమనీ మంది రామరాజ్జవ్వూ అంచేత కులభేదాలను పబ్లీకున చూపించరాదని ఆయనకి తెలిసినా, ఆయన దారి ఆయనదే, దేనికీ జంకే రకం కాదు. మంత్రిగారికి తన బంతిన పీట వేయించి భోజనం పెట్టాడు. ప్రతిపక్ష నాయకుడికి మాత్రం గదిలోకే పంపాడు. ఆయనా ఈయనా కూడా నవ్వుకున్నారు ఈ ఛాందసుడి అమాయకత్వానికి. సరే, ఓ రాత్రివేళ కారు బాగు పడొచ్చింది, ఇద్దరూ లేచి సెలవు దీసుకొని బయల్దేరి వెళ్ళిపోయారు.

వెళ్ళినచోట ఈపాటిగూడా తిండి, దాహం దొరకలేదనుకో. అక్కడ జనం పువ్వులు లేక కాయితపువ్వుల దండలూ, ఖద్దరు మాలలూ వేశారు. మంత్రిగారి గుండె గుభేలుమంది – కరువున్నూసిగాదు, దీనివల్ల ముందు రాబోయే ఉత్పాతాన్ని తలచుకొని, ప్రతిపక్ష నాయకుడు చిరునవ్వు నవ్వాడు – నే చెబితే విన్నారా అని, శాస్త్రులుగారు కూడా అటేపొచ్చి వీళ్ళనిద్దరినీ చూసి, మంచి నీళ్ల సప్లయి చేసి వెళ్ళాడు.

అక్కడ అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అంతా సిద్ధమవుతున్నారనీ, ప్రభుత్వ పక్షంలో దానికున్న ప్రతిపక్ష గ్రూపులు బయటి కొస్తున్నాయనీ తెలిసి, మంత్రిగారూ, ప్రతిపక్ష నాయకుడూ రాజధానికి అర్జెంటుగా బయల్దేరారు. ఎమర్జెన్సీ పరిస్థితి గదా? అదేం చిత్రమో తిరుగు దారిలో కూడా కారు చెడింది క్రిందటిసారిలాగే. ఈసారి రాత్రి పదిగంటల వేళ పెద్దలిద్దరూ శాస్త్రిగారి భవంతి చేరారు. భోజనానికి కూర్చోబోతున్న శాస్త్రులుగారు లేచి వచ్చి ఇద్దరికీ మర్యాదల్జేశాడు. రాజధాని భోగట్టా తనకు తెలిసింది చెప్పి వారికి తెలిసింది విన్నాడు. స్నానాలు కాగానే భోజనానికి లెమ్మన్నాడు. ఈమాటు ప్రతిపక్ష నాయకుణ్ణే లోపలికి దీసుకెళ్ళి తన చెంతన కూర్చోబెట్టి భోజనం పెట్టాడు. మంత్రిగారికి మాత్రం గదిలోకి పంపాడు భోజనం.

మంత్రిగారు ఈ మాటు నవ్వుకోలేదు. తను బ్రాహ్మడేగాని, తనతో వచ్చినాయన నాయుడు. మరి శాస్తుర్లుగారు పొరబడడానికి ఆస్కారం లేదు. చిన్నబుచ్చుకొని ఆకలి వల్ల మారు మాటాడక భోజనం ఆరగింపు కానిచ్చాడు. కాస్రాగానే ఇద్దరూ వెళ్ళిపోయారు.

"సుబ్బరాజా, శాస్త్రులుగారు ఇలా విపరీతంగా మర్యాదలు చేయటానికి అర్థవేవిటి? బ్యామ్మలాయనకి బయట భోజనం పెట్టి నాయుడిని తన బంతినెందు కూర్చోబెట్టాడు? అది మొదటిసారెందుకు చెయ్యలేదు?" అన్నాడు రెడ్డిగారు కథ ఆపి.

సుబ్బరాజు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. ఒక నిమిషం సేపు ఆలోచించాడు. చివరకో తీర్మానానికొచ్చాడు.

"శాస్తుర్లుగారు ఆళ్ళ కులాన్నిబట్టి మర్యాద చెయ్యలేదు. బుద్ధుల్నిబట్టే, ఉద్దేశాల్ని బట్టేని... కరువు ప్రాంతం చూడబోయేటపుడు మంత్రిగారు కరువు అనుకున్నంత

దారుణంగా ఉండకూడదనీ ప్రజలు కులాసాగా ఉండి తన మాట దక్కాలనీ, వర్షాలు కురవాలనీ దేవుడికి మొక్కుకుంటూ ఉంటాడు గదా? అందుకాయనకి మర్యాద చేశారు. ఇహ ప్రతిపక్షపాయన కరువు జోరుగా ఉండాలనీ, ఈ దెబ్బదెబ్బ గవర్నమెంటు దెబ్బతిని తాము పవరులో కెక్కాలని కోరుతాడనీ ఊహజేసి ఆయనకి బయట కూడు బెట్టించాడు. తిరిగొచ్చేటప్పుడు కథ అడ్డం తిరిగింది. మంత్రిగారు పదవి దిగడం ప్రతిపక్ష పాయన పవరుకెక్కడం ఖాయం అని తేలిపోయింది. ఆ టయిములో ప్రతిపక్షపాయన తను పదవికి రాగానే వర్షాలు కురవాలనీ, పంటలు పండాలనీ కోరుతాడు. మంత్రిగారు యీ పరిస్థితి ఇలాగే ఈళ్ళూ ఇరుకున పడాలని కోరుతాడు. శాస్తుర్లుగారు ఇలా ఊహచేసి బ్యామ్మలాయనకి బైటా, నాయడుగారికి లోనా భోజనం బెట్టి మర్యాజ్జేశాడు" అన్నాడు.

రామిరెడ్డిగారు జాలిగా నవ్వి సుబ్బరాజు వీపు తట్టాడు. "సుబ్బరాజా, నివ్వు నా కతలు విని చెడ్డావు. అన్నిటికీ అతి తెలివి జవాబులు ఆలోచిస్తున్నావు. గాని అందులో రహస్యం ఒక్కటే. శాస్త్రులుగారు అన్ని అర్థాలూ, తాత్పర్యాలూ చూడలేదు. వెళ్ళేటప్పుడు మంత్రిగారు పవరులో ఉన్నాడు. తిరిగి వెళ్ళేటపుడు ప్రతిపక్షపాయన పవరులోకి రాబోతున్నాడు. అంతే, పదవినిబట్టి ఆయన మర్యాజ్జేశాడు. ఆయనేటి, ఎక్కడేనా ఈ నాడంతే" అన్నాడు.

★ ★ ★